అపార్ వివరాలు సరిచూసుకోండి: డీఈఓ

కొత్తచెరువు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థి వివరాలు, అపార్, పాఠశాల ఎన్ఆర్ (నామినల్ రోల్) డేటాలో తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు అవకాశం కల్పించిందని జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాల రికార్డు, అపార్ ఐడీలో నమోదు చేసేటపుడు తప్పులేమైనా దొర్లాయా అని మరోసారి క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, ఫొటో తదితర వివరాలు మరోమారు సరిచూసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు డీఈఓ సూచిచారు.

అంతా హల్‌సెల్

శిక్షణ కార్యక్రమంలో సెల్‌ఫోన్లతో

ఉద్యోగులు బిజీ బిజీ

నార్పల ఎంపీడీఓ కార్యాలయంలో ఘటన



6

ఎన్నాళ్లకో.. ఉల్లింత..!

ఉల్లిసాగుతో లాభాల పంట

సంతోషంలో పిన్నేపల్లి రైతులు

ఎకరాకు రూ.3 లక్షల వరకు ఆదాయం



7

పంటలకు చీడపీడలు

అన్నదాతల ఆందోళన...

పట్టించుకోని ఉద్యాన శాఖ

అధికారులు

6



గురుకులంలో కలుషితాహారం

- 13 మంది విద్యార్థినులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థిని మహేశ్వరి

పెనుకొండ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం సమీపంలో గల మహాత్మ జ్యోతిబాపూలే (ఎంజీపీ) బాలికల గురుకుల పాఠశాలలో కలుషితాహారం తిని, 13 మంది విద్యార్థినులు అస్వస్థతకు లోనయ్యారు. వీరిని హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. పాఠశాలలో 228 మంది విద్యార్థినులు చదువుతున్నారు. సోమవారం రాత్రి 6.30 గంటలకు హాస్టల్‌లో వండిన అన్నం, సాంబార్ తిన్నారు. ఒక గదిలో ఉంటున్న కొంతమంది విద్యార్థినులకు వాంతులు అయ్యాయి. వారిని హుటాహుటిన పాఠశాల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 13 మందిలో 12 మంది ఆరోగ్యం నిలకడగా ఉండడంతో డిశ్చార్జ్ చేశారు. ఆరో తరగతి విద్యార్థిని మహేశ్వరి మాత్రం అడ్మిషన్‌లో ఉంది. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి మంజువాణి, తహసీల్దార్ శ్రీధర్, ఎంఈఓ సుధాకర్.. పాఠశాలకు చేరుకుని విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరాతీశారు. అందరూ క్షేమంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలలో మంగళవారం ఉదయం నుంచి గుట్టూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజునాయక్ సిబ్బందితో వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు.

హాస్టల్‌లోకి బయటి ఆహారం రానీయొద్దు: మంత్రి సవిత

రాష్ట్రవ్యాప్తంగా బీసీ హాస్టళ్లలోకి బయటి ఆహారాన్ని తీసుకురానీయవద్దని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత.. అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అస్వస్థతకు లోనైన ఎంజేపీ పాఠశాల విద్యార్థినుల గురించి జిల్లా వైద్యాధికారి మంజువాణిని ఫోన్‌లో మంత్రి ఆరాతీశారు. కలుషితాహారం తీసుకోవడం కారణంగానే అస్వస్థతకు లోనైనట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు. విద్యార్థినులు అందరూ కోలుకున్నట్లు మంత్రికి వివరించారు.

ఎంఈఓపై లైంగిక వేధింపుల కేసు నమోదు

బుక్కపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) గోపాల్‌నాయక్‌పై మంగళవారం లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఓ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఈనెల 16న ఎంఈఓ కార్యాలయానికి సంతకం నిమిత్తం వెళ్లారు. ఆ సమయంలో ఎంఈఓ గోపాల్‌నాయక్.. తన చెయ్యి పట్టుకుని, అసభ్యంగా ప్రవర్తించారని బాధితురాలు మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

నేటి నుంచి పోలీసు స్పోర్ట్స్ మీట్

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శిరసాని పోలీసు పరేడ్ మైదానంలో బుధవారం నుంచి పోలీసు స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. మూడురోజులపాటు పోటీలు కొనసాగనున్నాయి. తొలిరోజు కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న పోటీలను ప్రారంభిస్తారని ప్రకటనలో వెల్లడించింది.

ఖాకీల్లో.. కలవరం..!

పోలీసుల అక్రమాలను ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. ఆరోపణలు వచ్చిన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. పెనుకొండ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్‌లో ముగ్గురు సిబ్బందిని వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీచేశారు. హిందూపురంలో మరొకరిపై చర్యలు తీసుకున్నారు. ఒకేరోజు నలుగురు సిబ్బందిని వీఆర్‌కు పంపడం ఖాకీల్లో కలవరం రేపింది. కూటమి అధికారం చేపట్టాక అవినీతి పోలీసులపై ఉన్నతాధికారులు నిఘా వేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొంత మంది పోలీసులు విధులను పక్కనబెట్టి వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించారు. మరికొందరు పార్టీకి వీరవిధేయులుగా పనిచేశారు. ఈ తరుణంలో కూటమి అధికారంలోకి వచ్చాక అలాంటి సంప్రదాయానికి స్వస్తి పలుకుతూ ప్రజలకు రక్షణగా నిలవాలని పోలీసు సిబ్బందికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. అయినా ఐదేళ్లూ అక్రమార్కులకు అండగా నిలిచి, దొంగలు, దోపిడీదారులకు విధేయులుగా పనిచేసిన కొంతమంది తీరు మార్చుకోలేదు. ఇలాంటి వారిపై ఉన్నతాధికారులకు ప్రజలు నేరుగా ఫిర్యాదులు చేస్తున్నారు. వాటిని పరిశీలించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, రుజువైతే వేటు వేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం

- సిబ్బంది అవినీతిపై ఉన్నతాధికారులు సీరియస్
- ఒకేరోజు వీఆర్‌కు నలుగురు కానిస్టేబుళ్లు



ఒకేరోజు నలుగురు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపడం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది.

అత్యాచారం ఘటన మరువకనే..

హిందూపురం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సామూహిక అత్యాచారం కేసు నిందితుల్లో పాత నేరస్తులున్నారు. వారికి గతంలో హిందూపురంలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి వారితో అంటకాగారు. ఆ నిందితులు ఇచ్చిన సమాచారంతో ఏకంగా 13 మందిని సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులు భావించారు. ముగ్గురిని సస్పెండ్ చేస్తూ మిగిలిన వారిపై బదిలీ వేటు వేశారు. ఈ 13 మందిలో అనంతపురం జిల్లాకు చెందినవారున్నారు. జిల్లాలో పనిచేస్తున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటన జిల్లాలోనే కలకలం రేపగా.. తాజాగా మంగళవారం నలుగురు సిబ్బందిని వీఆర్‌కు పంపడంతో ఖాకీలో వణుకుపుట్టింది.

త్వరితగతిన విచారణ

ఓ స్టేషన్‌లో ముగ్గురిని వీఆర్‌కు పంపడం ఆశాఖలో కలకలం రేపింది. వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో వాటిని విచారించి, వేటువేశారు. విచారణ త్వరితగతిన చేపట్టినట్లు సమాచారం. ఇంత వేగంగా జరగడానికి అధికార పార్టీలోని ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేసినట్లు పోలీసు అధికారుల్లో చర్చ సాగుతోంది.

కారణమేంటో?

ఒకే స్టేషన్‌లో ముగ్గురిని తాజాగా వీఆర్‌కు పంపారు. వారిలో ఇద్దరు రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించి డబ్బు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారికి పంపిన ఫిర్యాదులో బాధితులు.. ఫోన్‌పే రికార్డుతోపాటు మరికొన్ని ఆధారాలు, వీడియో క్లిప్పింగ్‌లు అందజేసినట్లు సమాచారం. మరో కానిస్టేబుల్ భూపంచాయితీలో తలదూర్చారని ఓ పోలీసు అధికారి ద్వారా తెలుస్తోంది. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌కు ఇటీవలే బదిలీపై వచ్చిన కానిస్టేబుల్‌ను మంగళవారం వీఆర్‌కు పంపారు.

ప్రజాప్రతినిధి ఫిర్యాదుతో..

హిందూపురం మండలంలోని కోచింగ్ సెంటర్‌లో ఈనెల 16న ఘర్షణ జరిగింది. ఇక్కడ జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన విద్యార్థి చదువుకుంటున్నాడు. సదరు విద్యార్థిని కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కొట్టారు. దీనిపై తల్లిదండ్రులు, మరికొంతమంది కోచింగ్ సెంటర్‌కు వచ్చి హల్‌చల్ చేశారు. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ అక్కడకు వచ్చి నిలువరించే ప్రయత్నం చేశారు. అక్కడున్న విద్యార్థి తల్లిదండ్రులు కానిస్టేబుల్‌పైనే తిరగబడ్డారు. ఈ సందర్భంలో కానిస్టేబుల్.. విద్యార్థి బంధువుపై చేయిచేసుకున్నట్లు సమాచారం. విద్యార్థి తల్లిదండ్రుల తరఫున జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి.. కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపినట్లు ఉత్తర్వులు జారీచేశారు.

వీఆర్‌కు నలుగురు కానిస్టేబుళ్లు

గోరంట్ల/హిందూపురం: జిల్లాలో ఒకేరోజు నలుగురు పోలీసు కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు మంగళవారం వీఆర్‌కు పంపారు. గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు రెడ్డి ప్రభావతి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేషను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ రత్న మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో వారిపై ఆరోపణలు రావడంతో వారిని వీఆర్‌కు పంపినట్లు తెలుస్తోంది. వెంటనే జిల్లా కేంద్రం పుట్టపర్తిలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఆ మేరకు వారు గోరంట్ల స్టేషన్ నుంచి మంగళవారం రిలీవ్ అయ్యారు. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌కు ఇటీవలే బదిలీపై వచ్చిన కానిస్టేబుల్ రవికుమార్‌ను మంగళవారం వీఆర్‌కు పంపారు.



పాపాఘ్ని నదిలో ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుకను కుప్పలు వేస్తున్న దృశ్యం

నదిలో ఇసుక వేట.!

ప్రవహిస్తున్న పాపాఘ్ని నదిలో యథేచ్ఛగా తవ్వకాలు

ఇసుకాసురులు బరితెగించారు. నదులను గుల్ల చేస్తున్నారు. ఇదివరకు నదుల్లో నీరు లేనిచోట ఇసుక తవ్వేశారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేశారు. తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్ సమీపాన పాపాఘ్ని నదిలో ఏకంగా ప్రవహిస్తున్న నీటిలోనే ఇసుకను తోడేస్తున్నారు. నది నీటి మధ్యలోకి వెళ్లి ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుక తవ్వి, కుప్పలుగా పోస్తున్నారు. తరువాత ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. పాపాఘ్ని నదిపై ఎగువన నిర్మించిన సీజీ ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. దీంతో నదిలో నీరు జోరుగా ప్రవహిస్తోంది. అయినా ఇసుక కోసం నదిలోకి ఎక్స్‌కవేటర్లను దింపి, తోడుతున్నారు. పారుతున్న నది నుంచి ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయకపోవడంతో ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు ఇసుకను తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. ప్రవహిస్తున్న నది నుంచి ఇసుకను తరలించడం ఆపకపోతే భవిష్యత్తులో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పడిపోవచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు.

-తనకల్లు(ఆంధ్రజ్యోతి)

రెండు రోజుల్లో ఇంటికి వస్తానన్నాడు...

- ఇంతలోనే అనంతలోకాలకు...
- రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



మహేంద్ర నాయక్ (ఫైల్)

రైల్వే కోడూరు(రూరల్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజుల్లో ఇంటికి వస్తానని చెప్పిన కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపోయాడనీ, ఏడాదిలో కోర్సు పూర్తి చేసి, బాగా చూసుకుంటానని చెప్పి ఇలా మోసం చేస్తాడని అనుకోలేదు అంటూ ఆ తల్లిదండ్రుల రోదిస్తుండడం చూసిన వారందరూ కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వివరాల మేరకు... శ్రీసత్యసాయి జిల్లా నల్లమడ తండాకు చెందిన తులసీధర్, తిరుపాల్‌బాయి దంపతుల కుమారుడు మహేంద్ర నాయక్ (21) తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీలో అనస్థీషియా కోర్సు రెండో సంవత్సరం చదువుతుండేవాడు. సోమవారం అర్ధరాత్రి బైక్‌లో కోడూరుకు వస్తుండగా శెట్టిగుంట పంచాయతీ పరిధి కడప-చెన్నై ప్రధాన రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. తోటి విద్యార్థులు కోడూరుకు చేరుకుని మహేంద్ర నాయక్ మృతదేహాన్ని చేసి, శోకసంద్రంలో మునిగిపోయారు.



రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో శోకసంద్రంలో తల్లిదండ్రులు

ఉపాధి నిధులతో అటవీశాఖలో

అభివృద్ధి పనులు

- కలెక్టర్ టీఎస్ చేతన్



అటవీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో అటవీశాఖలో అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మొక్కలు నాటడం, నగరవన సుందరీకరణ తదితర అంశాలపై కలెక్టర్ మంగళవారం జిల్లా అటవీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విజన్ 2040కి అనుగుణంగా అటవీశాఖ లక్ష్యాలు సాధించాలన్నారు. 2025-26లో 35లక్షల మొక్కలు నాటడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ చక్రపాణి, సామాజిక వనవిభాగ అధికారి వినోద్‌కుమార్, సబ్ డీఎఫ్‌ఓ ఆనంద్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై ర్యాలీ: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లోభాగంగా మంగళవారం పుట్టపర్తిలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ చేతన్ ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ కొనసాగించారు. ప్రజలకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించే పోస్టర్లు, ప్రచార సామగ్రిని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గురుకులంలో

ఉగ్గాని..!

- మెనూకి తిలోదకాలు
- డెప్యుటేషన్‌లో వంట మనుషులు
- వండి పెడుతున్న స్కావెంజర్లు, స్వీపర్లు
- ఉద్యోగి స్థానంలో దినకూలీ



ఉగ్గాని తయారు చేస్తున్న స్కావెంజర్

తనకల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీజీ ప్రాజెక్టు సమీపంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. బోధన సిబ్బంది లేరు. వంట మనుషులు డెప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో భోజనం వండిపెట్టేవారు కరువయ్యారు. స్కావెంజర్, స్వీపర్లే వంట వండిపెడుతున్నారు. మెనూకు తిలోదకాలిచ్చారు. వారు వండిపెట్టింది తినాల్సిన దుస్థితి నెలకొంది. పాఠశాలలో 5నుంచి 10వ తరగతి వరకు 460 మంది బాలికలు చదువుకుంటున్నారు. పాఠశాలలో బాలికలకు రోజూ ఉదయం పాలు, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం 5 గంటలకు చిరుతిండ్లు, రాత్రి భోజనం అందించాల్సి ఉంది. ఆ మేరకు ప్రభుత్వం మెనూ ప్రకటించింది. గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మాత్రం మెనూ ఊసేలేదు. వంట మనుషులు లేకపోవడంతో స్కావెంజర్లు, స్వీపర్లు వంటలు వండి, విద్యార్థినులకు వడ్డిస్తున్నారు. నెలరోజులుగా పాఠశాల టీచర్లు సమ్మెలో ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్న స్వీపర్, ఇద్దరు వంట మనుషులు ఏడాదిగా డెప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వారికి ప్రతినెలా పాఠశాల నుంచే జీతభత్యాలు చెల్లిస్తున్నారు. ఇదే గురుకుల పాఠశాలలో పనిచేసే ఓ వంట మనిషి దీర్ఘకాలంగా విధులకు హాజరు కావట్లేదు. ఆమె స్థానంలో ఉన్నతాధికారులే ఓ దినసరి కూలీని నియమించారు. పనిచేయకపోయినా ఆ వంట మనిషికి నెలనెలా వేతనం ఖాతాలో పడుతుండడం శోచనీయం.

ఉగ్గాని లేనేలేదు..

మెనూ ప్రకారం మంగళవారం ఉదయం అల్పాహారం ఇడ్లీ, చట్నీ, కోడిగుడ్డు ఇవ్వాల్సి ఉంది. బొరుగులతో ఉగ్గాని చేసి మమ అనిపించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూలో ఉగ్గాని లేనే లేకపోవడం గమనార్హం. ఇక్కడ పనిచేస్తున్న వంట మాస్టరు ఎనిమిది నెలల క్రితం మృతిచెందడంతో ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. వంట మనుషుల కొరత కారణంగా మెనూ పాటించకుండా ఇక్కడ పనిచేస్తున్న అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.దీంతో బాలికలకు పౌష్టికాహారం అందండంలేదని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని డెప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపిన ఉన్నతాధికారులు.. ఇక్కడ ఇతరులను నియమించాలన్న విషయాన్ని మరిచారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని, గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యార్థినులు అడిగారని..

విద్యార్థినులు అడిగారని ఉగ్గాని పెట్టాం. ఉన్నతాధికారులు ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని ఇతర ప్రాంతాలకు డెప్యుటేషన్‌పై పంపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తున్నాం.

- సుస్మిత జ్యోత్స్న, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్



విద్యార్థినులకు ఉగ్గాని వడ్డిస్తున్న సిబ్బంది

పంటలకు చీడ పీడలు

పట్టించుకోని ఉద్యాన శాఖ అధికారులు



బసంపల్లిలో చీనీకి సోకిన తెగులు

శెట్టూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సాగు చేసిన ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతు న్నారు. మండలంలో రైతులు మామిడి పంటను దాదాపు వెయ్యి ఎకరాలు, చీనీ వంద ఎకరాలకు పైబడి, టమోటా 200 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. వీటితో పాటు సపోటా, దానిమ్మ, అల్ల నేరేడు, బీర తదితర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పొగమంచు విపరీతంగా ఉండటంతో మామిడికి తేనెమంచు పురుగు ఆశించింది. చీనీకి పచ్చ పురుగు, ఆకు మచ్చ తెగుతు సోకింది. టమోటాను కాయతొలుచు పురుగు, పచ్చపురుగు, మచ్చ తెగులు ఆశించాయి. వీటి నివారణకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో చీడపీడల నివారణకు ఎలాంటి మందులు వాడాలో తెలియక రైతులు ఎరువుల దుకాణదారులను ఆశ్రయిస్తున్నారు. వారిచ్చే సలహాలమేరకు పురుగు మందులు తెచ్చి పిచికారీ చేస్తున్నారు. అయినా తెగుళ్ల అదుపులోకి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఉద్యాన రైతులకు ఉద్యాన శాఖ అధికారులను అందుబాటులో ఉంచేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తెగులు సోకిన ఆకు

అంతా హాల్‌సెల్

శిక్షణ కార్యక్రమంలో సెల్ ఫోన్లతో బిజీ బిజీ

అందరూ సెల్‌ఫోన్‌లోనే కాలక్షేపం చేస్తుంటే మరి చెప్పేది వినేవారెవరు? శిక్షణ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని నెరవేర్చేదెవరు? శిక్షణలో చెప్పేది వినకపోతే రేప్పొద్దున క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇవన్నీ ఆ ఉద్యోగులకు ఏమీ పట్టలేదు. ఏదో కాలక్షేపానికి వచ్చాం అన్నట్లుగా సెల్‌ఫోన్ చూస్తూ ఉండిపోయారు. ఇదీ.. నార్పల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం తీరు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గ్రామాభివృద్ధి ప్రణాళిక, పేదరికం, బాల్యవివాహాల నిర్మూలనపై ఎంపీడీఓ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గదిలో ఎంపీడీఓ శిక్షణ ఇస్తుండగా... వచ్చిన ఉద్యోగుల్లో ఎక్కువమంది కార్యక్రమాన్ని పక్కన పెట్టి సెల్ ఫోన్లతో బిజీ బిజీగా కాలం గడిపారు. సదుద్దేశంతో పెట్టిన ఈ కార్యక్రమానికి హాజరైన కొందరు ఉద్యోగులు సెల్‌ఫోన్‌లో మునిగిపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

- నార్పల





రీ సర్వేతో కొత్త కష్టాలు

రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ
పరిష్కరించలేకపోతున్న అధికారులు
గత ప్రభుత్వ వైఫల్యం వల్లే సమస్యలు

డీ.హీరేహాళ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అవగాహనారాహిత్యంతో చేసిన భూ రీసర్వేతో రైతులకు కొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 13 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఈ రీసర్వే జరిగిన ప్రతి గ్రామంలో రికార్డులు తప్పుల తడకగా నమోదు చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రీసర్వే జరిగే సమయంలో అధికారులు, రైతులకు సమన్వయం లేకపోవడంతో చాలా ఇబ్బందులు తలెత్తాయి. చాలా గ్రామాల్లో రీసర్వే జరుగుతున్న విషయం కూడా రైతులకు తెలియకుండా ముగించేశారు. రీసర్వే ద్వారా వచ్చిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకుంటే .. సమస్య ఎలా పరిష్కరించాలో తెలియడం లేదని వారు సైతం వాపోతున్నారు.

ఎల్‌పీఎం ఖాతా నంబర్ల గందరగోళం

రీసర్వేకు ముందు ఖాతా, సర్వే నెంబర్ల ద్వారా రికార్డులు నమోదు చేసేవారు. రీసర్వే అనంతరం ఖాతా, ఎల్‌పీఎం నంబర్లు మాత్రమే కేటాయించారు. ఇక్కడే సమస్య ఉత్పన్నమైంది. ఒక కుటుంబంలో ఒకరు అంతకన్నా ఎక్కువ మంది పేరున భూమి ఉంటే వారికి సంబంధించిన యాజమాన్య రికార్డుల ప్రకారం ఒక్కొక్కరికి ఒక్కొక్క ఖాతా, ఒక ఎల్‌పీఎం కేటాయించాలి. అలా కాకుండా మొత్తం అందరికీ కలిపి ఒకే ఎల్‌పీఎం కేటాయించారు. దీంతో ఆ రైతులు తమ భూములను అమ్ముకోవడానికి లేదా వేరొకరి పేరు మీదకు బదలాయించేందుకు వీలు లేకుండా పోయింది. వేరొకరి పేరు మీద భూ యాజమాన్య హక్కు మార్చాలంటే కచ్చితంగా ప్రతి ఒక్కరికి ఒక ఎల్‌పీఎం ఉండాల్సిందే. కొంతమంది భూములు కొనుక్కున్న రైతులు రిజిస్ట్రేషన్ దస్తావేజుల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకం పొందినా ప్రస్తుతం రీసర్వే జరిగిన గ్రామాలలో ఆన్‌లైన్‌లో గతంలో అమ్మిన వారి పేర్లే కనిపిస్తున్నాయి. దీంతో భూమికొన్న రైతులు లబోదిబోమంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తే రీసర్వే జరిగిన గ్రామాల్లో ఆన్‌లైన్ పని చేయడం లేదు. ఈక్రమంలో మార్పులు, చేర్పులకు అవకాశం కుదరడం లేదు. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులకు కూడా పూర్తి స్పష్టత లేదు.



కొత్త చిక్కులు వచ్చాయి

చాలా ఏళ్లుగా మా భూ రికార్డులు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. ప్రతి ఏడాది ఏ సమస్యా లేకుండా అడంగల్ వచ్చేది. కానీ గత సంవత్సరం రీసర్వే చేసినప్పటి నుంచే కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. రీసర్వే అనంతరం భూ విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. ఎల్‌పీఎంలు ఖాతాలకు సంబంధించి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటిని మార్చుకోవడం కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కూటమి ప్రభుత్వమైనా రీసర్వే ద్వారా ఎదురైన సమస్యలు పరిష్కరించాలి.

- నాగరాజు, డి హీరేహాళ్



పాత రెవెన్యూ రికార్డులే నయం

గత ప్రభుత్వం చెప్పిన విధంగా రీసర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అనుకున్నాం. రీసర్వే జరిగిన తర్వాతే అసలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎల్‌పీఎం నంబర్ ఏమిటో అర్థం కావడం లేదు. గతంలో ఉన్న రెవెన్యూ రికార్డులే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఏమైనా సమస్య వస్తే అధికారులు సులభంగా సమస్యను పరిష్కరించే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడలా లేదు. రీసర్వే ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి పాత రెవెన్యూ రికార్డులనే కొనసాగించాలి.

- నరసింహ, హిర్దేహాళ్



మార్పులు, చేర్పులకు వీలు పడటం లేదు

భూ రీసర్వే అనంతరం చాలా గ్రామాలలో భూ విస్తీర్ణంలో తేడాలు, ఎల్పీఎం నంబర్ల సమస్య ఉత్పన్నమయ్యాయి. వాటిని సరిదిద్దడం కోసం ప్రయత్నిస్తుంటే ఆన్‌లైన్‌లో వీలుకావడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారులకు కూడా తెలియజేశాం. ప్రస్తుతం రీసర్వే ప్రక్రియ కూడా పూర్తిగా నిలిపివేశాం. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య ఉంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల కోసం వేసి చూస్తున్నాం.

- అనిల్‌కుమార్, తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పది విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక

డీఈఓ ప్రసాద్‌బాబు



అనంతపురం విద్య, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తామని డీఈఓ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఉన్నత పాఠశాల్లో నెలకొన్న సబ్జెక్ట్ టీచర్ల కొరతను అధిగమించడంతోపాటు స్టడీ మెటీరియల్ అందించడం తదితర అంశాలపై దృష్టి సారిస్తామని డీఈఓ మంగళవారం తెలిపారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో చాలా హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్ల కొరతను ఎలా పరిష్కరిస్తారు?

డీఈఓ: ఉన్నత పాఠశాలల్లో సుమారు 200 వరకూ సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. దీనిపై కసరత్తు చేస్తున్నాం. మరో వారం రోజుల్లో టీచర్ల కొరత సమస్యను పరిష్కరించి, సకాలంలో విద్యార్థులకు బోధన సాగేలా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: టెన్త్ పరీక్షలకు ఎంత మంది ఇప్పటి వరకూ ఫీజు చెల్లించారు ?

డీఈఓ: జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 32,913 మంది విద్యార్థులు ఫీజు చెల్లించారు. ఫైన్‌తో ఫీజు చెల్లింపునకు ఇంకా గడువు ఉండటంతో...ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: 10వ తరగతి విద్యార్థులకు గతంలో "అనంత సంకల్పం" మెటీరియల్ అందించేవారు. ఈ ఏడాది ఆ ప్రక్రియ ఎక్కడి వరకూ వచ్చింది..?

డీఈఓ: పదో తరగతి విద్యార్థులకు అందించే మెటీరియల్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) కార్యదర్శి, ఇతర సభ్యులతో త్వరలోనే చర్చిస్తాం. మెటీరియల్ ముద్రణ, ఇతర అంశాలపై ఒక నిర్ణయం తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: అపార్ ఐడీ జనరేషన్ జిల్లాలో ఎంత వరకూ వచ్చింది....?

డీఈఓ: జిల్లాలో అపార్ ఐడీల జనరేషన్ పారదర్శకంగా, కచ్చితత్వంతో చేసే దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే చాలా వరకూ పూర్తి చేశాం. కేవలం 90 వేల వరకూ పెండింగ్ ఉండే అవకాశం ఉంది. సాంకేతిక సమస్యలను అధిగమించి పెండింగ్ కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: సమగ్రశిక్ష ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల ఖాళీలు ఎప్పుడు భర్తీ చేసే అవకాశం ఉంది..?

డీఈఓ: ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ ఫైల్‌ను ఇప్పటికే విద్యాశాఖ కమిషనర్, ఎస్పీడీకి కూడా తెలియజేశాం. సుమారు 10 రోజుల కిందటే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కమిషనర్, ఎస్పీడీ నుంచి ఆదేశాలు రాగానే ఆ పోస్టుల భర్తీ చేస్తాం.

అంతా సీక్రెట్..!

గుట్టుగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్
పోస్టు భర్తీకి రేపు కంప్యూటర్ పరీక్షలు

అనంతపురం విద్య, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని బాలసదన్‌లో ఖాళీగా ఉన్న స్టోర్ కీపర్ కం అకౌంటెంట్ పోస్టు భర్తీపై గోప్యత పాటిస్తున్నారు. బాలసదన్‌లో ఖాళీగా ఉన్న ఒక కాంట్రాక్టు పోస్టుకు ఇటీవల దరఖాస్తులు స్వీకరించారు. 47 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అభ్యర్థులకు ఎప్పుడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారో తెలియడం లేదు. దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మందికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా గతంలో ఉన్న ఉన్నతాధికారులు గోప్యంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిసింది. ఆఖరికి 18 మందిని ఎంపిక చేసి వారికి ఈ నెల 19న కంప్యూటర్ పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలోని ఎల్లోరా బాయ్స్ హాస్టల్ పక్కన ఉన్న సెంట్రల్ కంప్యూటర్ సెంటర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు అభ్యర్థులకు కంప్యూటర్ నైపుణ్య పరీక్షలు నిర్వహించే ఏర్పాట్లు చేశారు. దీనిపై పలువురు అభ్యర్థులు అనుమానం, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రీమియం లిక్కర్ స్టోర్ మంజూరు

31లోగా దరఖాస్తు చేసుకోవాలి: ఈఎస్

అనంతపురం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేశారన్నారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలన్నారు. రెండో ఏడాది దానిపై 10 శాతం పెంచుతామన్నారు. ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం కనీసం 4000 చదరపు అడుగులు వైశాల్యం ఉండాలన్నారు. ఈ స్టోర్‌లో ఐఎంఎఫ్ఎల్ కనీస ధర రూ.1200, బీర్ ధర రూ.400పైన ఉన్న స్టాక్ విక్రయాలు మాత్రమే జరుగుతాయన్నారు. స్టోర్‌లో మద్యపానం అనుమతించబడదన్నారు. మద్యం, సిగార్లు, సిగరెట్లు, మద్యానికి సంబంధించిన ఉపకరణాలు, శీతల పానీయాలను విక్రయించవచ్చునన్నారు. ప్రీమియం స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తును https//apsbcl.ap.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలు నాన్ రిఫండబుల్ అన్నారు. ఈ డబ్బును డీడీ ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 31 సాయంత్రం 5 గంటల్లోగా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను ఆఫ్‌లైన్ పద్ధతిలో నేరుగా సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను రాష్ట్ర కమిషనర్‌కు పంపుతామని, రాష్ట్ర ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ముందుకు వెళతామని తెలిపారు.

అంజన్న హుండీల ఆదాయం రూ.62.62 లక్షలు

గుంతకల్లు, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి వివిధ హుండీల ద్వారా రూ. 62.62 లక్షల ఆదాయం లభించింది. ఆలయంలోని హుండీలను మంగళవారం ఉదయం తెరచి సొమ్మును లెక్కించారు. సాయంత్రం వరకూ డబ్బును లెక్కగట్టగా ప్రధాన హుండీల ద్వారా రూ. 62,36,139లు, అన్నదానం హుండీ ద్వారా రూ. 26,206లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఏడు గ్రాముల ఒక మిల్లీ గ్రాము బంగారం, 1. 630 కిలోల వెండి వస్తువులు వచ్చినట్లు ఈఓ వాణి తెలిపారు. అలాగే 120 కెనడా డాలర్లు, 205 నేపాల్ రూపాయలు, 10 సౌదీ అరేబియా రియాళ్లు లభ్యమైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, అనంతపురం డివిజనల్ దేవదాయశాఖ తనిఖీ అధికారి వన్నూరు స్వామి, ఏఈఓ వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటు వెంకటేశులు, అర్చకులు, సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.



హుండీల సొమ్మును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, వలంటీర్లు

తస్మాత్ జాగ్రత్త

మాతాశిశుమరణాలు జరిగితే చర్యలు తప్పవు
డీఎంహెచ్ఓ హెచ్చరిక

అనంతపురం టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు జరిగితే చర్యలు తప్పవని డాక్టర్లు, సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి హెచ్చరించారు. జిల్లావైద్యశాఖ కార్యాలయంలో నవంబరు నెలలో జరిగిన మాతాశిశుమరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాతృ మరణాలు 5, శిశుమరణాలు 5 ఎందుకు జరిగాయని ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఇపుడు కారణాలు చెప్పడంకాదు, మళ్లీ మీవద్ద ఇలాంటివి సంభవిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాతాశిశుమరణాలు పూర్తిగా అరికట్టాలని ప్రభుత్వాలు అనేక పథకాలు, కార్యక్రమాలు తీసుకొచ్చిందన్నారు. అలాంటపుడు ఇంకా మరణాలు జరుగుతుండటం దురదృష్టకరమన్నారు. గర్భిణులను గుర్తించిన తర్వాత నుంచి వారికి అవసరమైన వైద్యసేవలు అందించడంతో పాటు, పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. ప్రతినెలా పరీక్షించి అనారోగ్యంతో ఉంటున్నవారిని, రక్తహీనతతో బాధపడుతున్నవారిని గుర్తించి హైరిస్క్ కేసులుగా పరిగణించి, ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ప్రసవ సమయంలోను ముందుగానే ఆస్పత్రులకు పంపించాలన్నారు. నెలలు నిండకుండానే పుట్టిన శిశువులను వెంటనే ఎన్ఆర్‌సీలో చేర్పించి అవసరమైన వైద్యం అందించాలని ఆదేశించారు. డాక్టర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మరణాలు జరగకుండా చూడాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టరు యుగంధర్, అనస్తీషియా డాక్టరు నవీన్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు శంకరనారాయణ, డాక్టర్లు పార్వతి, శ్రీనివాసులు, డీపీరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాతాశిశుమరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

డాక్టర్లకు ఐదుగుణాలే ఆభరణాలు

ఇస్కాన్ ఆధ్యాత్మిక ప్రవచనకర్త సత్యగోపీనాథ్ దాస్

అనంతపురం టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్లకు స్వచ్ఛమైన తెల్లటి దుస్తులు, చెరగని చిరునవ్వు, నిబ్బరం, అంకితభావం, విసుగులేకుండా సేవలు అందించడమనే ఈ ఐదు గుణాలే ఆభరణాలు అని ఇస్కాన్ ఆధ్యాత్మిక ప్రవచనకర్త సత్యగోపీనాథ్‌దాస్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్యశాఖ కమిషన్ కోరిక మేరకు మంగళవారం వైద్య కళాశాలలో డాక్టర్లు, నర్సులకు ఆచరణాత్మక కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సత్యగోపీనాథ్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని చూసినపుడే రోగులకు సగం రోగం తగ్గిపోతుందన్నారు. సామాజిక సంబంధాలు, మానవతా విలువలు మధ్య సమన్వయం పాటిస్తూ వృత్తి ధర్మాన్ని నిర్వహించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారిసహాయకుల పట్ల ప్రేమగా మెలగాలని, డిశ్చార్జ్ అయ్యే వరకు ఎక్కడా ఏ లోటు రాకుండా చూసుకోవాలన్నారు. అపుడే మనపై మరింత గౌరవం పెరగడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టరు హేమలత, డాక్టరు పద్మజ డాక్టర్లు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సత్యనాథ్ గోపీదాస్‌ను సత్కరిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టరు



ఈవీఎంల పరిశీలన అనంతరం గోడౌన్‌కు సీల్ వేయిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు, రాజకీయపార్టీలతో కలిసి పాత ఆర్డీఓ ఆఫీస్ ఆవరణలోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అక్కడ ఈవీఎంలు భద్రంగా ఉన్నాయా? ఎలాంటి భద్రతా చర్యలు తీసుకుంటున్నారనే అంశాలను పరిశీలించారు. అనంతరం అందరి సమక్షంలోనే ఆ ఈవీఎంల గోడౌన్‌కు సీల్ వేయించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, తహసీల్దార్ హరికుమార్, కలెక్టరేట్ సెక్షన్ ఆఫీసర్లు యుగేశ్వరి, కనకరాజు, దివాకరరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్నీ ఏకగ్రీవమే

సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక



జీబీసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా ఎన్నికైన మారయ్య

అనంతపురం క్లాక్‌టవర్/విడపనకల్లు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా హెచ్చెల్సీ పరిధిలోని సాగునీటి సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. హెచ్‌ఎల్ఎంసీ అధ్యక్షుడిగా కొండాపురం కేశవరెడ్డి, ఉపాధ్యక్షులుగా గిరప్పగారి రమేష్‌బాబు ఎన్నికయ్యారు. మిడ్‌పెన్నార్ సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా కొర్రపాటి శేఖర్, ఉపాధ్యక్షుడిగా కుమ్మెత చంద్రాయుడు ఎన్నికయ్యారు. మిడ్‌పెన్నార్ నార్త్‌కెనాల్ అధ్యక్షుడిగా రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మీనుగ వెంకటేష్ ఎన్నికయ్యారు. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ ప్రెసిడెంట్‌గా కుమ్మెత ప్రమీళమ్మ, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడుగా మారయ్య, ఉపాధ్యక్షులుగా అప్పా రామకృష్ణ, ఆలూరు బ్రాంచ్ కెనాల్ నగరడోన కిష్టప్ప, ఉపాధ్యక్షులుగా మీసాల రామాంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్చెల్సీ పరిధిలోని ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అధికారపార్టీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలోనే ఎన్నికలు నిర్వహించినట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు.

అర్హులందరికీ డ్రిప్ పరికరాలు

- ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన రైతులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరు చేయాలని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గుంటూరు నుంచి మంగళవారం ఆయన అన్ని జిల్లాల ఏపీఎంఐపీ పీడీ, ఏపీడీ, డ్రిప్ కంపెనీల రాష్ట్ర కోఆర్డినేటర్లు, జిల్లా కో ఆర్డినేటర్లలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 42459 మంది రైతులు 58475 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి దాకా 17850 మంది రైతులకు సంబంధించి 21809 హెక్టార్లల్లో ప్రాథమిక సర్వే పూర్తయిందన్నారు. వీరిలో 6568 మంది రైతులు 7731 హెక్టార్లకు రైతు వాటా డబ్బులు డిజిటల్ పద్ధతిలో చెల్లించారన్నారు. ఇందులో జిల్లా కలెక్టర్ 5794 మంది రైతులకు 6818 హెక్టార్లకు పరిపాలన ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇందులో ఇప్పటి దాకా 3611 మంది రైతులకు 4245 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేసినట్లు వివరించారు. మిగిలిన రైతులకు త్వరగా డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు సరఫరా చేయడంతోపాటు పొలాల్లో బిగించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



ఎస్ఎస్‌బీఎన్, పీవీకేకే జట్ల మధ్య మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్‌కళాశాల క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఎస్కేయూ అంతర్‌కళాశాలల క్రికెట్ పోటీలు రెండో రోజు మంగళవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో కొనసాగాయి. పీవీకేకే కళాశాలపై ఎస్ఎస్‌బీఎన్ జట్టు గెలుపొందింది. కదిరి ఎస్‌టీఎస్ఎన్ కళాశాలపై తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. గుంతకల్లు ప్రభుత్వ ఎస్కేపీ కళాశాల జట్టుపై అనంతపురం వివేకానంద కళాశాల, కళ్యాణదుర్గం ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌పై గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కాలేజ్, పెనుకొండ పరిటాల డిగ్రీ కళాశాల జట్టుపై కదిరి బ్లూమూన్ డిగ్రీ కళాశాల జట్టు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై అనంతపురం ఆర్ట్స్ కాలేజ్ జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ, ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ పిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులునాయక్, పీడీలు శ్రీరామ్, జయరాం, ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడాపోటీలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు బుధవారం నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్(ఐపీఎస్‌జీఎం-2024)ను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ పోటీలను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారి అవసరాల కోసం 9912342020, 7901620020 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

ఆరేళ్ల తరువాత..!

అత్యాచారయత్నం కేసులో ఇద్దరు బిహారీల అరెస్టు

పరిగి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారయత్నం కేసులో ఇద్దరు బిహారీలను పోలీసులు ఆరేళ్ల తరువాత అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఎస్‌ఐ రంగడు యాదవ్ వెల్లడించారు. బిహార్‌కు చెందిన యువకులు జోగి మాండల్ అలియాస్ జోగేంద్ర, దిలీప్ గతంలో మండలానికి వచ్చి, ఓ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తుండేవారు. 2017 డిసెంబరు 17న మండలానికి చెందిన ఓ మహిళ పరిశ్రమ సమీపంలో పశువులు మేపుకుంటుండగా వీరిరువురు ఆమెపై అత్యాచారానికి యత్నించారు. అప్పట్లో కేసు నమోదైంది. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బిహార్ రాష్ట్రానికి వెళ్లి, నిందితులను అరెస్టుచేసి తీసుకొచ్చినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ధర్మవరంలో దొంగల హల్‌చల్

- నాలుగు దుకాణాల్లో చోరీ
- రూ.లక్ష నగదు, వస్త్రాల అపహరణ



సీసీ టీవీ ఫుటేజీలో దొంగలు

ధర్మవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ప్రియాంకనగర్‌లో పుట్టపర్తి రహదారి పక్కనగల కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాల్లో చోరీ చేశారు. షట్టర్లను ఇరువైపులా వంచి, తాళాలను పక్కకు జరిపి లోపలకు చొరబడ్డారు. ప్రభాకర్‌కు చెందిన ఆటో మొబైల్స్ షాపులో రూ.15వేలు, మహేశ్‌కు చెందిన హార్డ్‌వేర్ షాపులో రూ.20వేలు, నాగార్జునకు చెందిన పెయింట్స్ షాపులో రూ.50వేలు, పవన్‌కు చెందిన దుస్తుల దుకాణంలో రూ.15వేలు నగదుతోపాటు వస్త్రాలు, వస్తువులను ఎత్తికెళ్లినట్లు బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు షాపులను పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఇద్దరు దొంగలు మొహాలకు మాస్కులు వేసుకుని కనపించారు. ఆ మేరకు ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి, తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వారు హిందూపురం ప్రాంతానికి చెందిన వారని సమాచారం. పోలీసులు పట్టణంలో నిఘా పెంచి, రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలుడి అదృశ్యం



కుటుంబ సభ్యులతో మహ్మద్ అల్మాస్ (వృత్తంలో..)

పెనుకొండ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబయ్యస్వామి దర్గాకు కుటుంబ సభ్యులతో వచ్చిన బాలుడు మహ్మద్ అల్మాన్(4) మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. చిత్రదుర్గకు చెందిన జాఫర్.. భార్య, కుమారుడు మహ్మద్ అల్మాన్‌తో కలిసి మంగళవారం బాబయ్యస్వామి దర్గాకు వచ్చారు. దర్గా వెనుకవైపు షెడ్డులో ఆడుకుంటుండగా మహ్మద్ అల్మాన్ తప్పిపోయాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7 పలికినట్లు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.26,400

అనంతపురం రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26,400, కనిష్ఠంగా రూ.11వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 27 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

741 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు మంగళవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 719 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 627 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎన్నాళ్లకో... ఉల్లింత..!

- ఉల్లి సాగుతో లాభాల పంట
- సంతోషంలో పిన్నేపల్లి రైతులు
- ఎకరాకు రూ.3లక్షల వరకు ఆదాయం



పిన్నేపల్లి వద్ద సాగుచేసిన ఉల్లిపంట

యాడికి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ధరలు బాగుండటంతో ఉల్లిసాగు చేసిన రైతులు లాభాలు కళ్లజూస్తున్నారు. పంట దిగుబడి అధికంగా రావడం, అదే సమయంలో ధరలు బాగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో సుమారు 150ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగుచేశారు. ఎకరాకు 120నుంచి 140ప్యాకెట్ల ఉల్లి దిగుబడి వచ్చింది. ఇదే సమయంలో ఉల్లిప్యాకెట్ (50కిలోలు) ధర రూ.2600 నుంచి గరిష్ఠంగా రూ.2800 వరకు పలకడంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. ఎకరా ఉల్లి సాగుకు దాదాపు రూ.30వేలు ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతు న్నారు. ప్రస్తుతం దిగుబడి, ధర బాగుండటంతో ఎకరాకు రూ.3లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. ధరలు, దిగుబడి మరికొంత కాలం ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.



మార్కెట్‌కు తరలించడానికి లోడింగ్ చేస్తున్న దృశ్యం

నారు నాటడం మాని... విత్తనం చల్లుతూ

సాధారణంగా రైతులు ఉల్లి పంట సాగు చేయాలంటే నారు పోసుకొని, లేదా కొనుగోలు చేసి నాటేవారు. దీనికి ఖర్చుతోపాటు కూలీల కొరత కూడా ఎక్కువగా ఉండేది. ఎక్కువ విస్తీర్ణంలో ఉల్లి సాగు చేయాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఉల్లి నారు నాటడం కాకుండా ఉల్లి సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకున్న తర్వాత విత్తనాలు చల్లే పద్ధతిని పాటిస్తున్నారు. నారు నాటడానికి, విత్తనం చల్లడానికి పెద్ద తేడా ఏమిలేదని ఉల్లి సాగు చేసిన రైతులు తెలిపారు. పైగా నారు నాటడానికి అయ్యే కూలీల ఖర్చు తగ్గిపోతుందని వారు చెబుతున్నారు. ఒక రోజులోనే ఒక వ్యక్తే ఎక్కువ ఎకరాల్లో ఉల్లి విత్తనాలు చల్లగలుగుతాడని పేర్కొంటున్నారు.

యాడికి టు చెన్నై

మండలంలోని యాడికి, పిన్నేపల్లి, కోనుప్పలపాడు, ఓబులాపురం, కత్తిమానుపల్లి, పచ్చారుమేకలపల్లి, లక్షుంపల్లి, రాయలచెరువు తదితర గ్రామాల్లో ఉల్లి సాగు చేస్తారు. పంట పండిన తర్వాత కోత కోస్తారు. దిగుబడిని వాహనాల్లో లోడ్ చేసుకుని సాయంత్రం వేళ చెన్నై మార్కెట్‌కు బయల్దేరుతారు. తెల్లవారుజామున మార్కెట్ ప్రారంభ సమయానికి అక్కడకు చేరుకుని విక్రయిస్తారు.

ఎకరాలో సాగు చేశా



ఈ ఏడాది ఒక ఎకరాలో ఉల్లి సాగుచేశా. నారు నాటకుండా విత్తనం చల్లించా. ఖర్చు తక్కువే. పంట సాగుకు మొత్తం రూ.30వేలు ఖర్చు అయింది. 115ప్యాకెట్ల దిగుబడి వచ్చింది. అన్ని ఖర్చులు పోను రూ.3లక్షల వరకు ఆదా యం వచ్చింది. పిన్నేపల్లి గ్రామంలో ఈ ఏడాది ఉల్లి సాగు మంచి లాభాలను తెచ్చి పెట్టింది.

- రామ్మోహన్, ఉల్లి రైతు, పిన్నేపల్లి

ఆరెకరాల్లో సాగు



నేను ఆరు ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశాను. ధరలు బాగా ఉన్నప్పుడు పంట దిగుబడి కూడా బాగా వచ్చింది. ఉల్లిప్యాకెట్ రూ.2200 నుంచి రూ.2800 వరకు పలికింది. ఆరు ఎకరాల్లో ఉల్లి దిగుబడికి రూ.22లక్షల ఆదాయం వచ్చింది. ధరలు ఎన్ని రోజులు నిలకడగా ఉంటాయో చెప్పలేము. ధరలు నిలకడగా ఉంటే ఉల్లి రైతుకు లాభమే.

- విశ్వేశ్వరరావు, ఉల్లి రైతు, పిన్నేపల్లి

ఆ మృతదేహం రామాంజినమ్మదే..

- హత్యకేసులో నలుగురికి రిమాండ్

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖలో అటెండర్‌గా పని చేస్తూ హత్యకు గురైన రామాంజినమ్మ కేసును అనంతపురం రూరల్ పోలీసులు ఛేదించారు. ఆ కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. అక్టోబరు 17న రామాంజినమ్మ అదృశ్యం కావడం కలకలం రేపింది. అనంతరం 15రోజులకు ఆమె అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితులు పట్టుబడ్డారు. మృతదేహం నవంబరు రెండోవారంలో కనిపించింది. ఆ మృతదేహం రామాంజినమ్మదా కాదా అనే అనుమానంతో పోలీసులు డీఎన్‌ఏ రిపోర్టుకు పంపారు. రిపోర్టులో మృతదేహం రామాంజినమ్మదేనని తేలడంతో నిందితులు కేశవ, క్రిష్ణ, మోహన్, గంగాధర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

చైన్ స్నాచింగ్

అనంతపురం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండల పరిధిలో ఓ చైన్‌స్నాచింగ్ జరిగింది. లలితానగర్‌కు చెందిన హేమలత కిరాణాదుకాణం, వాటర్ ప్లాంట్ నిర్వహిస్తోంది. ఓ ఫంక్షన్‌కు వెళ్లి మంగళవారం తిరిగి దుకాణానికి వచ్చింది. ఓ వ్యక్తి సిగరెట్లు కావాలని అడిగాడు. ఆమె సిగరెట్ల కోసం కిందకు వంగే ప్రయత్నం చేయగానే ఆమె మెడలోని ఒకటిన్నర తులాల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. సాయంత్రం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

రాయదుర్గంరూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదుం గ్రామంలో ఈ నెల 10న పొలం గట్టు వివాదంలో గంగాధర మృతికి కారణమైన శివ, వంశీ, సూర్యలను అరెస్టు చేసినట్లు సీఐ జయనాయక్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ చదుం గ్రామానికి చెందిన దొణప్ప, చిన్న గంగప్ప, పెద్ద గంగప్పకు మూడు ఎకరాల పొలం ఉంది. పొలం గట్టు వివాదంలో దొనప్ప కుమారుడు గంగాధర్‌కు చిన్న గంగప్ప కుమారుడు శివ, పెద్ద కుమారుడు వంశీ, సూర్యలతో గొడవ ఉండేది. పొలం వివాదంలో అడ్డొస్తున్నాడని మనసులో పెట్టుకొని పదో తేదీ మధ్యాహ్నం తల్లి రుద్రమ్మతో కలిసి గంగాధర్ పొలంలో పని చేస్తుండగా ముగ్గురు కలిసి కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన గంగాధర్‌ను రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి రుద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ముగ్గురిని సోమవారం పట్టణ శివారులోని గాలి మారమ్మ గుడి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైసీపీ కో-ఆప్షన్ సభ్యుడిపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మైనార్టీ నాయకులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్ మహబూబ్ బాషాపై మంగళవారం రాత్రి టీడీపీ మైనార్టీ నాయకులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల కిందట అనంతపురం వైసీపీ నాయకులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఫ్లయింగ్ మహబూబ్ బాషా ఓ సోషల్ మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడని వన్‌టౌన్ సీఐ మనోహర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే నారా బ్రాహ్మణిపై తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు చెందిన అంజిపురం విజయ్‌కుమార్ సోషల్ మీడియాలో అనుచితమైన పోస్ట్ పెట్టాడు. నాలుగు రోజుల కిందట టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని మంగళవారం రాత్రి గుంతకల్లుకు తీసుకువచ్చారు. ఇతడిపై కేసు నమోదు చేసి 41నోటీసులు ఇచ్చి పంపించినట్లు పోలీసులు తెలిపారు.

రాయదుర్గం-బళ్లారి మీదుగా కుంభమేళా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్ కుంభమేళాను పురస్కరించుకుని జిల్లాలోని రాయదుర్గం, కర్ణాటకలోని బళ్లారి మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. మైసూరు-దానాపూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (నం. 06207) రైలు జనవరి 18, ఫిబ్రవరి 15, మార్చి 1న (శనివారాలలో) మైసూరులో సాయంత్రం నాలుగున్నరకు బయలుదేరి మూడు రోజుల తర్వాత మంగళవారం ఉదయం 10 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06208) జనవరి 22, ఫిబ్రవరి 19, మార్చి 5న (బుధవారాలలో) దానాపూర్‌లో తెల్లవారుజామున 1-45 గంటలకు బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మైసూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు మాండ్య, మద్దూరు, కెంగెరి, కేఎస్ఆర్ బెంగళూరు, యశ్వంతపూర్, టుముకూరు, అరిసికెరె, చిగ్గాజుజుర్, చిత్రదుర్గ, రాయదుర్గ, బళ్లారి కంటోన్మెంటు, హోస్పేట, కొప్పల్, గదగ్, హుబ్లి, బాదామి, బాగల్‌కోట్, విజయపుర, షోలాపూర్, కురుద్వాడి, డౌండ్, అహ్మదానగర్, కోపర్‌గావ్, మన్మాడ్, భుసావల్, ఖండ్వా, తల్వాడ్యా, చనేర, ఖిర్కియా, హర్దా, బాణాపుర, ఇటార్సి, పిప్రియ, నరసింగ్‌పూర్, జబల్‌పూర్, కట్నీ, మైహర్, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, చునర్, దీన్‌దయాల్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, ఆర స్టేషన్ల మీదుగా వెళ్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

జైళ్ల నుంచి వృద్ధులకు విముక్తి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

కదిరి లీగల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జైళ్లలో ఏళ్లుగా మగ్గిపోతున్న వయోవృద్ధులకు విముక్తి కల్పించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం శ్రీకారం చుట్టిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం కదిరి సబ్‌జైలును తనిఖీ చేశారు. సబ్‌జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న ఆహార నియమాలు, ఆరోగ్య అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో కార్యదర్శి మాట్లాడుతూ.. సబ్‌జైలులో ఉంటూ 70 పదుల వయసు దాటినా బయటకు వచ్చే పరిస్థితిలేని వారి కోసం ఉన్నత న్యాయస్థానం మార్గనిర్దేశాలను జారీ చేసిందన్నారు. వయోవృద్ధుల జాబితాలను తయారు చేయమని ఆదేశించిందన్నారు. అనారోగ్యం బారినపడి ఆఖరి దశలో ఉన్న వారి వివరాలను కూడా ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు. అలాంటి వారిపై కమిటీ వేసి, వారి పరిస్థితుల దృష్ట్యా సొంత పూచీకత్తుపై విడుదల చేయడమా, మరో మార్గాన్ని అన్వేషించడంలో భాగంగానే తనిఖీ చేస్తున్నామన్నారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో ఏళ్లుగా జైళ్లలో ఉంటున్న 70 ఏళ్లు దాటిన, అనారోగ్య పీడితులకు విముక్తి కలిగి, ఊరట లభించగలదన్నారు.

హామీని నిలబెట్టుకుంటాం

- పెన్షనర్ల దినోత్సవంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- ఘనంగా అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. లలితకళాపరిషత్‌లో అఖిలభారత పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాళంకి సుబ్బరాయన్, కార్యదర్శులు పీఎస్ఎన్ మూర్తి, సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పెన్షనర్ల ఉద్యమ నాయకుడు దివంగత నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వారికి సముచితమైన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా తన గెలుపులో పెన్షనర్ల పాత్రను ఎప్పటికీ మరువలేనన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు టీడీపీ ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందన్నారు. ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాళంకి సుబ్బరాయన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వైసీపీ చర్యలతో విసిగిపోయి ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ ఏర్పాటు చేసి, అన్ని జిల్లాలో ఆపార్టీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించామన్నారు. సీఎం చంద్రబాబు తమ సమస్యల పట్ల సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెద్దనగౌడ్ మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీపై కమిషన్‌ను ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని విడుదల చేసి ఆదుకోవాలన్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పలువురు పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 1500 మందికిపైగా పెన్షనర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా సలహాదారులు డి. గోవిందరాజులు, కోశాధికారి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులు ఎస్ఎస్ వరదరాజులు, దివాకర్, పెన్షనర్లు మహమ్మద్, రమేష్‌కుమార్, పుల్లప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, అనంతయ్య, నారాయణస్వామి, నాగరాజేశ్వరీ, సావిత్రిదేవి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వాహాపై చర్యలేవి..?

ఉచిత మోటార్లను అమ్ముకున్న సాంబా మేనమామ



- రూ.50 లక్షలకుపైగా సొమ్ము చేసుకున్నవైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అప్పటి అధికారులు
- కూటమి ప్రభుత్వంలో చర్యల కోసం డిమాండ్

శింగనమల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఉచితంగా మంజూరు చేసిన వ్యవసాయ మోటార్లను మాయం చేసిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వైసీపీ అధికారంలోని రాగానే ఆపార్టీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి మేన మామ రైతులకు సంబంధించిన ఉచిత వ్యవసాయ మోటార్లను అమ్ముకొని రూ.అరకోటికిపైగా సొమ్ము చేసుకున్నాడు. అప్పట్లో రైతులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో అమ్ముకున్న వ్యవసాయ మోటార్ల రికవరీకిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

300 మోటార్లు మంజూరు

గత టీడీపీ ప్రభుత్వం రైతుల నుంచి పాత వ్యవసాయ మోటార్లు తీసుకుని కొత్తవి ఇవ్వడానికి సంకల్పించింది. ఇందులో భాగంగా మండలంలో 1050 మంది రైతులకు 5 హెచ్‌పీ మోటార్లను మంజూరు చేసింది. ఈక్రమంలోనే తొలి విడతగా 300 మోటార్లను శింగనమలలోని స్టాక్ పాయింట్‌కు చేర్చారు. అయితే ఈ మోటార్లను పంపిణీ చేస్తే మిగిలిన రైతులు గొడవలు పడతారన్న ఉద్దేశ్యంతో విద్యుత్‌శాఖ అధికారులు పంపిణీ చేయలేదు. ఈక్రమంలో ఆరు నెలలు గడిచి పోయాయి. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో రైతులకు పంపిణీ చేయకుండా అలాగే ఉంచేశారు. ఎన్నికల తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో మోటార్ల విషయం మరచిపోయారు.

అమ్మేసిన వైసీపీ నాయకుడు

వైసీపీ అధికారంలోకి రాగానే ఆలూరు సాంబశివారెడ్డి మేనమామ ఈ ఉచిత మోటార్లపై కన్నేశాడు. అనుకున్నదే తడవుగా కొందరు విద్యుత్ అధికారులు సాయంతో 297 మోటార్లను స్టాక్ పాయింట్ నుంచి తన స్వగ్రామం ఈస్టు నరసాపురంలోని పాత పాఠశాలకు చేర్చాడు. అప్పటి నుంచి వీలు కుదిరినప్పుడట్లా అనంతపురంలో ఉన్న తన బంధువుల షాపు ద్వారా మోటారు స్టార్టర్ రూ.30 వేల నుంచి 40 వేలు వరకు అమ్మి సొమ్ము చేసుకున్నాడు. మోటార్లు అమ్మిన మొత్తం ఎంత తక్కువ అనుకున్నా అరకోటికి పైగా ఉంటుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

విద్యుత్ అధికారుల వింత వాదన

మండలంలోకి 300 ఉచిత వ్యవసాయ మోటార్లు రావడం నిజమేనని, అయితే ఈ విషయంలో తమకు సంబంధంలేదని, మోటార్లు కాంట్రాక్టర్‌కే సంబంధం అంటూ విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మోటార్ల మాయం వెనుక అప్పటి మండల విద్యుత్ అధికారి వైసీపీ నాయకుడికి పూర్తిగా సహకరించినట్లు సమాచారం. కాంట్రాక్టర్‌కు మోటార్లు సంబంధించిన బిల్లులు ఇంకా రాలేదని అధికారుల సమాచారం. మోటార్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్న వైసీపీ నాయకుడితో రికవరీ చేయాలనే డిమాండ్లు వినవస్తున్నాయి.

మోటార్ల గురించి తెలియదు: విజయ్‌కుమార్, విద్యుత్ ఏఈ

నేను నూతనంగా ఏఈగా బాధ్యతలు చేపట్టా. ఉచిత మోటార్లపై నాకు ఏమీ తెలియదు. గతంలో ఇక్కడ పని చేసిన ఏఈలు మోటార్ల రికార్డులు కార్యాలయంలో ఉంచలేదు. సమగ్ర రికార్డులు లేకపోవడంతో ఉచిత మోటార్లు ఎన్ని వచ్చాయనే వివరాలు లేవు.


క్రిమినల్ కేసు పెట్టాలి



శింగనమల మండల వైసీపీ నాయకుడు బొమ్మన శ్రీరామిరెడ్డి రైతులకు సంబంధించిన ఉచిత వ్యవసాయ మోటార్లను అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. రైతులను నిలువునా మోసం చేశాడు. అప్పటిలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోయింది. కూటమి ప్రభుత్వమైనా వైసీపీ నాయకుడిపై విచారణ చేసి, రైతులు మోటార్లు అమ్ముకున్నందుకు క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

-చిన్న ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ నాయకుడు


దర్జాగా తిరుగుతున్నాడు



ఉచిత మోటార్లు అమ్మి సొమ్ము చేసుకున్న వైసీపీ నాయకుడు దర్జాగా తిరుగుతున్నాడు. రైతులకు సంబంధించిన మోటార్లు అమ్ముకోవడంపై పలుమార్లు అధికారులు, అప్పటి ప్రజాపతినిధులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వమైనా రైతులకు అందాల్సిన ఉచిత మోటార్లును వైసీపీ నాయకుడి నుంచి రికవరీ చేసి రైతులకు ఇవ్వాలి.

- చిన్నప్పయాదవ్ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

చర్యలు తప్పవు



మండల రైతులకు వచ్చిన 300 ఉచిత వ్యవసాయ మోటార్లను మండల వైసీపీ నాయకుడు అమ్ముకొని సొ మ్ము చేసుకున్నాడు. మోటార్లు అమ్ముకున్న ఆ నాయకుడిపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. విచారణ చేయించి ఆ నాయకుడిపై చర్యలు తీసుకునే విధంగా ముందుకు వెళతాం.

- అనంత చౌదరి, తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి

న్యూస్ బాక్స్

నేడు రెవెన్యూ సదస్సు

నల్లమాడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక 1, 2, 3 సచివాలయాల పరిధిలోని రైతుల కోసం బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు. ప్రజల సమస్యలపై వినతిపత్రాలు అందచేయాలని, వాటిని సత్వరమే పరిష్కరిస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అందుబాటులో ఉండని ట్రాక్టర్

గాండ్లపెంట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల వ్యవసాయ పనుల నిమిత్తం మంజూరు చేసిన ట్రాక్టర్ అందుబాటులో ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. ఈ మేరకు మండలంలోని వేపరాల పంచాయతీలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాబురావుకు ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్ ఆర్బీకే వద్ద అందుబాటులో ఉంచాలని కోరారు. వ్యవసాయ పనులకు ప్రైవేట్ ట్రాక్టర్‌కు బాడుగకు వస్తే గంటకు రూ.1000 వసూలు చేస్తారని, అదే ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్ రూ.1200 డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆ బాడుగను రూ.800 తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలను పరిష్కరించాలి

గాండ్లపెంట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌లోని అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని జీవీహెచ్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్ నాయక్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం 31 రోజులుగా సమ్మె చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, పనికి సమాన వేతనం, హెచ్‌ఆర్‌సీ పాలసీ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఎస్కేయూ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం తిరువ నంతపురం యూనివర్శిటీ ఆఫ్ కేరళలో ఈనెల 18వ నుంచి 22 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న కే.సాయి కుమార్ ఎంపికయ్యాడు. ఇతను శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ఫుట్‌బాల్ జట్టు తరఫున ఆ పోటీల్లో పాల్గొంటా రన్నారు. ఇతన్ని మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్టీ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు, సిబ్బంది మంగళవారం అభినందించారు.



కె. సాయికుమార్

పోలీస్ స్టేషన్ తనిఖీ

తనకల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం కదిరి రూరల్ సీఐ నాగేంద్ర తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాత నేరస్థుల వివరాలను హెడ్‌కానిస్టేబుల్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మండలంలోని ఓ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థి అదృశ్యమైన విషయాన్ని ఆరాతీశారు. అన్ని పాఠశాలల్లో మహిళ పోలీసులు వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు.

వేరుశనగలో కలుపు సమస్య

నంబులపూలకుంట, డిసెం బరు 17(ఆంధ్రజ్యోతి): మం డలంరబీలో సాగుచేసిన వేరుశనగలో కలుపు అధికం గా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వరసగా చిరుజల్లు పడుతుండడంతో కలుపు ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కలుపు తీయడానికి కూలీలు దొరకడంలేదని బాధపడుతున్నారు. మరో రెండు రోజుల్లో మరో తుఫాన్ ఉందని వార్తలు వెలువడంతో ఏమిచేయాలో అర్థంకావడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక

ధర్మవరం రూరల్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో మూడు కంపెనీ ప్రతినిధులు మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 41మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 18 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి హరీష్, కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు, నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్, సీడాప్ డీపీటీఎం నారాయణస్వామి, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై అయ్యప్ప ఊరేగింపు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారిని అశ్వవాహనంపై ఊరేగించారు. ఎం.కొత్తపల్లి, వడ్డివారిపల్లి, ఓడీసీ ఎస్సీ బీసీ కాలనీ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం స్వామి వారిని పులివాహనంపై ఊరేగిస్తున్నట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల అంజనేయులనాయుడు తెలిపారు.

కూలీల సంఖ్య పెంచండి

నల్లచెరువు: మండలంలో ఉపాధి కూలీల శాతం పెంచాలని ఏపీడీ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోకులం షెడ్ల నిర్మాణం పూర్తి అయ్యేలా చూడాలన్నారు. మండలానికి 35 గోకులం షెడ్లు మంజూరుకాగా, అందులో 28 వివిధ దశల్లో ఉన్నాయని, మిగలిన ఏడు నిర్మాణాలు చేపట్టలేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, ఈసీలు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

తాగునీటి పైపు లీకేజీ

ధర్మవరంరూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురంలో తాగునీటి పైపులీకేజీ అయి నీరంతా వృథా అవుతోంది. గ్రామంలో ఇలా ఐదుచోట్ల తాగునీటి పైపులైన్ లీక్ అవుతోంది. ఆ నీరు రోడ్డుపై నిల్వ ఉంటోందని, నీటి సరఫరా ఆగిపోయినప్పుడే అదే నీరు పైపుల్లోకి చేరుతోందని ఆ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాగునీరు కలుషితం అవుతోందన్నారు. అంతేకాకుండా నీరు రోడ్లపై నిల్వ ఉండటంతో దోమలూ విపరీతంగా పెరుగుతున్నాయని వాపోతున్నారు. రోజుల తరబడి ఈ సమస్యతో ఇబ్బందులు పడుతు న్నామని, ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇకనైనా మండల అధికారులు స్పందించాలని కోరుతు న్నారు.



రోడ్డుపై నిల్వ ఉన్న నీరు →

రేషన్ మాఫియా..!



కదిరిలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, అధికారులు

ప్రభుత్వం పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తోంది. దాన్ని అక్రమార్కులు కేజీ రూ.10తో కొంటున్నారు. వాటిని కేజీ రూ.30 నుంచి రూ.35కు మిల్లర్లకు వారు అమ్ముతున్నారు. వాటిని రీసైక్లింగ్ చేసి.. పాలిష్ చేసి.. సన్న బియ్యంలా మార్చి.. మార్కెట్లో కేజీ రూ.50 నుంచి రూ.70కి వివిధ బ్రాండ్ల పేర్లతో.. సోనామసూరి బియ్యం అంటూ విక్రయిస్తున్నారు. ఇదో రకం దందా.. మరికొందరు అక్రమార్కులు ఇతర రాష్ట్రాలకు కేజీ రూ. 30 నుంచి రూ. 40 ప్రకారం టన్నులు.. టన్నులు తరలించి.. సొమ్ము చేసుకొంటున్నారు. ఇది మరో రకం దందా.

- పేదల బియ్యం.. పెద్దల పాలు
- ప్రభుత్వం మారినా తగ్గని దందా
- యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలింపు
- రీసైక్లింగ్ చేసి.. సన్న బియ్యం పేరిట వ్యాపారం
- వివిధ బ్రాండ్లు.. సోనామసూరి అంటూ విక్రయాలు
- రూ.కోట్లు గడిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

కొత్తచెరువు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా రేషన్ మాఫియా దందా జోరు ఏ మాత్రం తగ్గలేదు. దారులు.. రూపాలు... మాత్రమే మారుతున్నాయే తప్పా మిగిలిదంతా సేమ్ టూ సేమ్. పేదల బియ్యాన్ని విక్రయిస్తూ అక్రమార్కులు రూ. కోట్లు గడిస్తున్నారు. ఆ రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ ఎక్కువసార్లు పాలిష్ చేసి వాటిని సన్నరకం బియ్యంగా మార్చుతున్నారు. వాటిని కలర్.. కలర్ ప్లాస్టిక్ సంచుల్లో... వివిధ రకాల బ్రాండ్ల పేరుతో వ్యాపారులు ప్రజలకు అమ్ముతూ సొమ్ము చేసుకొం టున్నారు. ఈ అక్రమ వ్యాపారం ఉమ్మడి జిల్లాలోని ధర్మవరం, ముదిగుబ్బ, గోరంట్ల, కొత్తచెరువు, పెనుకొండ, కనగానిపల్లి, సీకే పల్లి, కదిరి, తనకల్లు, ఎన్పీ కుంట, మడకశిర, రొళ్ల, బ్రమ్మసముద్రం, రామగిరి, రాప్తాడు, బొమ్మనహాల్లు, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం తదితర మండలాల్లో జోరుగా సాగుతోంది. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఈ వ్యాపారం మరీ ఎక్కువ. అక్రమార్కులు రేషన్ బియ్యా న్ని కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు లారీల్లో తరలిస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన విజిలెన్స్, పౌరసరఫరా, రెవెన్యూశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వారికి ముడుపులు అందుతుండటంతోనే ఆ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

● హోలోగ్రామ్ స్టిక్కర్ లేకుండానే విక్రయాలు

రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా పాలిష్ చేసి.. వివిధ రకాల బ్రాండ్ల పేరుతో మిల్లర్లు, వ్యాపారులు మార్కెట్లో విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కెట్లో విక్రయించే బియ్యం సంచులపై బ్రాండ్ల పేరు, రిజిస్ట్రేషన్ వివరాలు, మిలర్ల లోగో, హోలోగ్రామ్ స్టిక్కర్ కచ్చితంగా ఉండాలి. అక్రమార్కులు ఇవేమీ లేకుండా మార్కెట్లో సన్నబియ్యం పేరుతో రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో అక్రమార్కులు, మిల్లర్లు ఆకర్షణీయమైన సంచుల్లో బియ్యం నింపి.. సోనామసూరు బియ్యం అంటూ అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

● నామమాత్రంగా తనిఖీలు

ఉమ్మడి జిల్లాలో ప్రతినెలా పెద్దఎత్తున రేషన్ బియ్యం యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు అక్రమరవాణా అవుతున్నా.. అధికారులు మాత్రం నామమాత్రం తనిఖీలు నిర్వహిస్తు చేతులు దులుపుకొంటున్నారు. ఒకవేళ బియ్యం స్వాధీనం చేసుకున్నా... పెద్దగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. చాలామంది విజిలెన్స్, పౌరసరఫరా, రెవెన్యూశాఖ అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడం.. సమన్వయం లోపం.. నెలనెలా ముడుపులు అందుతుండటంతో ప్రభుత్వాలు మారినా.. రేషన్ దందా జోరు మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదనే ఆరోపణలున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి 2024 నవంబరు వరకు సత్యసాయి జిల్లాలో 10,462 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని.. 185 కేసులు నమోదు చేశామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వంశీక్రిష్ణారెడ్డి తెలిపారు.

● అధికారుల నిర్లక్ష్యం

ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ డీలర్లు ప్రజలకు రేషన్ అందజేస్తున్నారు. కొందరు డీలర్లు తూకాల్లో మోసం చేస్తూ.. భారీగా బియ్యం దండుకొంటున్నారు. మరికొంత మంది మూడు, నాలుగు రోజులు మాత్రమే రేషన్ సరఫరా చేసి.. తరువాత దుకాణాన్ని మూసేస్తున్నారు. షాప్‌కు ఎంత కోటా వచ్చింది.. ఎంత పంపిణీ చేశారు.. తుకాలు సరిగా వేస్తున్నారా.. అని తనిఖీ చేయాల్సిన పౌర సరఫరాలశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించు కోవ డం లేదు. ఇలా దుండుకున్న బియ్యాన్ని డీలర్లు అక్రమార్కులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు.





↑ గోరంట్ల సమీపంలో ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ

పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో కర్ణాటకకు తరలిస్తున్న బియ్యాన్ని ఇటీవల స్వాధీనం చేసుకున్న సీఎస్‌డీటీ రమేష్

చర్యలు తప్పవ్

జిల్లాలో ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలతో పాటు కేసులు కూడా నమోదు చేస్తాం. రేషన్ బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. ఎవరైనా రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే వారిపై ప్రభుత్వం తీవ్రమైన చర్యలు తీసుకొంటుంది.

- డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి

రైలు ఢీకొని 40 గొర్రెలు మృతి

రూ.5 లక్షలు నష్టం

ధర్మవరం రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వందేభారత్ రైలు ఢీకొని 40 గొర్రెలు మరణించిన సంఘటన మండలంలోని బడన్నపల్లి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. బడన్నపల్లి గ్రామానికి చెందిన శివయ్య 250కుపైగా గొర్రెలను పెంచుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజూ వాటిని మేపుకొని రావడానికి శివయ్యతో పాటు ఇద్దరు కూలీలూ వెళ్లేవారు. మంగళవారం వాటికి మేపుకొని రావడానికి ఇద్దరు కూలీలు మాత్రమే వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి బయలుదేరారు. మార్గంలో రైల్వే ట్రాక్‌పై వందేభారత్ రైలు వేగంగా వెళ్తుండటంతో.. ఆ శబ్దానికి భయపడిన గొర్రెలు రైలు పట్టాలపైకి పరుగులు తీశాయి. ఆ రైలు ఢీకొనడంతో సుమారు 40 గొర్రెలు మరణించాయి. సమాచారం అందుకున్న గొర్రెల యాజమాని శివయ్య, అతని కుటుంబ సభ్యులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని.. బోరున విలపించారు. తనకు సుమారు రూ. ఐదు లక్షల వరకు నష్టపోయినట్లు వాపోయారు.



రైలు ఢీకొనడంతో మరణించిన గొర్రెలు

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతిఒకరూ కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో యునిసెఫ్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలను అరికట్టడానికి గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. ఈ విషయంలో స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధుల సహకారం తీసుకోవా లన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే బాల్యవివాహాలను అరికట్టడానికి సాధ్యమవుతున్నారు. బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి, చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో యునిసెఫ్ ప్రతినిధి మురళీకృష్ణ, మహేష్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

● 20లోపు ఫ్రీహోల్డు వెరిఫికేషన్ పూర్తి చేయండి

కదిరి, పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో ఫ్రీహోల్డు భూముల వెరిఫికేషన్‌ను ఈ నెల 20లోపు పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి.. నివేదికలు ఇవ్వాలన్నారు. అలాగే ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో 22లోపు ఫ్రీహోల్డు వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. వీఆర్‌ఓలు, తహసీల్దారులు, ఆర్డీఓలు ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా నిర్ణీత సమయంలో ఈప్రక్రియ పూర్తి చేసి నివేదికలు అందించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయనరెడ్డి పాల్గొన్నారు.



యునిసెఫ్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

విజేత విద్యార్థులకు సన్మానం

నల్లమాడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓడీసీలోని విజ్ఞాన్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర జంప్‌రోప్ పోటీల్లో నల్లమాడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. తొమ్మిది స్వర్ణ, ఒక కాంస్య పతకం సాధించారు. వారిని మంగళవారం ఆ పాఠశాలలో అభినందించారు. జిల్లా గిరిజ సంక్షేమాధికారి మోహన్‌రావు, ఎంఈఓ సురేష్‌బాబు వారికి ప్రసంసాపత్రాలు, మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్, వార్డెన్ సత్యనారాయణ, పీడీ ధరణీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుచీరలను పరిశీలించిన న్యూఢిల్లీ నిపుణులు

ధర్మవరం: పట్టణంలో పట్టుచీరలను కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు న్యూఢిల్లీ నిపుణులు మంగళవారం పరిశీలించారు. ధర్మవరం పట్టుచీరలకు అవార్డు కోసం డిజైనర్ నాగరాజు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీ నుంచి అరిస్తీగుప్తా, జాస్మీన్‌కౌర్ ఆధ్వర్యంలో నిపుణులు చీరలను పరిశీలించడానికి ధర్మవరానికి వచ్చారు. పట్టుచీరలు తయారు చేసే విధానాన్ని డిజైనర్ నాగరాజు వారికి వివరించారు. వారి వెంట హ్యాండ్‌లూమ్ ఏడీ రామకృష్ణ, డీఓ రమణారెడ్డి, శీనానాయక్, సిరికల్చర్ అధికారులు ఉన్నారు.



పట్టుచీరలను పరిశీలిస్తున్న నిపుణులు

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

కదిరి అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పెన్షనర్ల పితామహుడు డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. 75 ఏళ్లు పైబడిన పెన్షన్ దారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీఎస్ శర్మ, ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బీవీ శివారెడ్డి, పీ ఆత్మారెడ్డి, సభ్యులు నరసిం హారెడ్డి, నందప్ప, పారేసు, సుభాషిణీ, షెక్షావలీ, శ్రీధర్‌మూర్తి, ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, విశ్రాంత ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : పట్టణంలోని ఎన్జీఓ కార్యాలయంలో పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఏటీఓ పద్మానాభం, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సందీప్, ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ అధ్యక్షులు శంకరనారాయణ, బ్యాంకు మేనేజర్లు నిగోల్, సువర్ణ పాల్గొన్నారు. వారు ఫించన్‌దారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చలపతి, ఆ సంఘం నాయకులు గోవిందరెడ్డి, సరోజిని, సదాశివరెడ్డి, కంబగిరి, శివయ్య, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● కొత్తచెరువు : స్థానిక పెన్షనర్ల భవనంలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ముగ్గురిని, 80 ఏళ్లు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగులను జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బి.రామక్రిష్ణయ్య సన్మానించారు. ఇందులో పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.





కదిరి, ధర్మవరంలో పెన్షనర్లకు సన్మానం

రస్తా స్థలం పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధర్మవరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పార్థసారధినగర్-2లో సర్వేనెంబర్ 650లో ఉన్న 33 అడుగుల రస్తాను కబ్జా చేయడానికి బీజేపీ ముసుగులో ఓ వైసీపీ నేత కుట్రపన్నాడు. అందులో భాగంగా ఆ స్థలంలో ఇంటిని నిర్మించుకోవడానికి రాళ్లు తరలించాడు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రిక మంగళవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆ స్థలాన్ని పరిశీలించాలని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సాయిప్రసాద్‌ను ఆదేశించారు. ఆయన, సిబ్బందితో వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించారు. నాలుగు రోజుల్లో నిర్మాణానికి తోలిన రాళ్లను తొలగించాలని, లేకపోతే ఆ రాళ్లను తామే మున్సిపల్ ట్రాక్టర్ ద్వారా తరలిస్తామని హెచ్చరించారు.

కోనేరును పరిశీలించిన ఎమ్మెల్యే



కోనేరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అర్చకులు

కదిరి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి కోనేరు (భృగుతీర్థం)ను ఆలయ ప్రధానార్చకులతో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో నిపుణులు, ఆలయ ప్రధాన అర్చకుల సలహాలు తీసుకోకుండా కోనేరు పనులు చేపట్టారన్నారు. రూ.కోట్లు ఖర్చు చేసినా... మద్దిలేరువాగు నీరు కోనేటిలోకి రాకుండా ఆపాలేకపోయారన్నారు. మరోసారి అలాంటి పొరపాట్లు జగరకుండా నిపుణులైన ఇంజనీర్లతో చర్చించి కోనేరులోకి మద్దిలేరు నీరు రాకుండా నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నరసింహచారులు, పార్థసారథాచారులు, ఎండోమెంట్ అధికారి స్థాపతి, ఈఓ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోత

ఇబ్బందుల్లో వాహనదారులు



గొల్లపల్లి క్రాస్ వద్ద రోడ్డుపై ఆరబోసిన వరిధాన్యం

ధర్మవరంరూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లప ల్లి క్రాస్ వద్ద ధర్మవరం నుంచి అనంతపురం వెళ్లే ప్రధాన రహదా రిపై రైతులు వరికల్లాలు వేసుకున్నారు. పగలంతా వరిధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టుకోవడంతో ఆ రహదారిపై ప్రయాణించే వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు ఏమరు పాటుగా వాహనాలను నడిపితే ప్రమాదాలకు గురికావాల్సిందే. రోడ్లపై ఆరబోసిన ధాన్యం దగ్గరకు వచ్చేవరకూ కనిపించదని, దీంతో వాహనం జారీ పడి అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెక్ డ్యాం పరిశీలన

బత్తలపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగారిపల్లి వద్ద పీఏబీఆర్ కాలువకు ఉన్న చెక్‌డ్యామ్ పూర్తిగా దెబ్బతింది. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విషయాన్ని ఇరిగేషన్ డీఈ మహేశ్వర రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. దీంతో ఆయన మంగళవారం ఆ చెక్ డ్యాంను పరిశీలించారు. త్వరలో బత్తలపల్లి, నారసింపల్లి చెరువులకు నీరు వస్తాయని, అంతలోను కాలువ పనులు, చెక్ డ్యాంకు మరమ్మతులు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నెట్టిం రమణ, వన్నురప్ప, చితంబర్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా..

50మంది అనాథ పిల్లలకు స్వెట్టర్ల పంపిణీ



స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

గోరంట్ల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మార్సీ పాఠశాల వద్ద లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది అనాధ పిల్లలకు స్వెట్టర్లను పంపిణీ చేశారు. భవిత కేంద్రం ఎమ్మార్సీ పాఠశాలలో దివ్యాంగులు, అనాతలను గుర్తించి వారికి సుంకు రఘునాథ్ గుప్తా, వరలక్ష్మి దంపతులు స్వెట్టర్లను సమకూర్చారు. ఎంఇఓ జాన్‌రెడ్డెప్ప చేతుల మీదుగా దాతలు స్వెట్టర్లను పిల్లలకు అందచేశారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షలకోసం మండలంలోని విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు అందచేయాలని ఎంఇఓ సూచించారు. లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు డీకే శ్రీనివాస్ ప్యాడ్లు అందజేయడానికి ముందుకొచ్చారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీకే రాజేష్, పద్మరేఖ, సభ్యులు దస్తగిరి, నాగరాజు, గిరిధర్‌గౌడ్, విజయలక్ష్మి, నర్సరీ శీనా, శివ, దామోదరరెడ్డి, ఉపాధ్యాయులు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యం

గోరంట్ల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలువారి దరిచేరవని ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ పేర్కొన్నారు. గోరంట్లలోని పులేరు రోడ్డులో నివాసముంటున్న వలసదారులు, వృద్ధులు, దివ్యాంగుల్లో 50మందికి హైజీనిక్ కిట్లను మంగళవారం సీఐ శేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఒకొక్క కిట్టులో సబ్బులు, కొబ్బరినూనె, టూత్‌పేస్టు, షేవింగ్‌సెట్, మహిళలకు శానిటరీ ప్యాడ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌సంస్థ సభ్యులు దేవాంగం జగదీశ్వర్, కోఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించుకోండి

అగళి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోడిపల్లిలో మగంళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సుబ్బారావు కోరారు. రైతుల నుంచి అర్జీలు వచ్చిన 45రోజుల్లో పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కేంద్రాలలో ప్రత్యేకంగా రైతుల సమస్యలు పరిష్కరించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గతంలో జరిగిన తప్పులు ఒప్పులు ఏమైనా ఉన్నా రెవెన్యూ సదస్సులో తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. రైతులు అడంగల్ సరిచేసుకోవాలన్నారు. భూతగాదాలున్నా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, వీఆర్‌ఓ కీర్తి, రమేష్, సర్పంచ్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు సీపీఐ మద్దతు

గోరంట్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):వేతనాలు పెంచాలని, రవాణా చార్జీలు చెల్లించాలని కోరుతూ గుంతపల్లి గార్మెంటు పరిశ్రమ మహిళ కార్మికులు చేస్తున్న ఆందోళనకు సీపీఐ నాయకులు మంగళవారం మద్దతు తెలిపారు. పరిశ్రమ ఎదుట మహిళలు సమస్యల సాధన కోసం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాముల ఆధ్వర్యంలో పరిశ్రమ వద్దకు వెళ్లి అధికారులతో చర్చించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచి, బస్సు సౌకర్యం, టిఎ, డిఎ, ఆసుపత్రి సౌకర్యాలు కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు జీతాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జయలక్ష్మీ, సురేష్‌బాబు, వెంకటేష్, రామక్రిష్ణ, మహేష్, శివశంకర్, బాబు తదితరులున్నారు.

విద్యుత్ ఉద్యోగుల అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భావితరాలకు వెలుగులు అందిద్దామని హిందూపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపతి పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని వీడీ రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం వద్ద నుంచి మెయిన్ బజార్, గాంధీసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్, సద్భావన్, గురునాథ్ సర్కిల్ మీదుగా డివిజన్ కార్యాలయం వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. విద్యుత్‌ను ఆదాచేసి భావితరాలకు వెలుగులు అందిద్దామన్నారు.. పల్లె పల్లెలో విద్యుత్ వెలుగులు రాష్ట్ర అభివృద్ధికి ప్రతీకలని, విద్యుత్ పొదుపు ఒక జీవన విధానమన్నారు. సోలార్ విద్యుత్ వాడకంపై ప్రజలకు వివరించి దాని ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈలు నాగన్న, జ్యోత్స్న, ఏఈలు 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో సమస్యల వెల్లువ

సోమందేపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సమస్యలు వెల్లువలా వచ్చాయి. నక్కలగుట్ట చౌడేశ్వరీ కాలనీలో సచివాలయానికి వెళ్లే రోడ్డును ఓ వైసీపీ నాయకుడు ఆక్రమించి అక్రమంగా గృహాన్ని నిర్మిస్తున్నారని కాలనీ ప్రజలు ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రాన్ని అందించారు. తమకు రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా నక్కలగుట్ట కాలనీలో పునాదులు వేసుకున్న నిరుపేదలను గుర్తించి వారికి పట్టాలు అందించాలని సీపీఎం నాయకులు కోరారు. పందిపర్తి పొలం సర్వే నంబరు 384లో సాగులో ఉన్న పేద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని వినతిపత్రాన్ని అందించారు. అలాగే సోమందేపల్లి దళిత స్మశానవాటికకోసం సర్వేనంబరు 7లో 3ఎకరాలు కేటాయించాలన్నారు. బస్టాండులో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను ప్రయాణికుల సౌకర్యార్థం వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్దన్న, అనుబంధ సంఘాల నాయకులు బెస్తకిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కంచిసముద్రంలో 11 అర్జీలు

లేపాక్షి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలో రెవెన్యూ గ్రామసదస్సు మంగళవారం కంచిసముద్రంలో నిర్వహించారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మొత్తం 11అర్జీలు అందాయి. సర్వే కోసం 3, అడంగల్ కరెక్షన్‌కు 2, పట్టాదారు పాసుపుస్తకాలకు 3, క్యాస్ట్ 3 అర్జీలు అందినట్లు తెలిపారు. వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

హిమసోయగాలు..





హిందూపురం, మడకశిర పట్టణాల్లో ఉదయం 9 గంటలైనా పొగమంచు వీడకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచు కురుస్తుండటంతో జనం చలితో వణికి పోతున్నారు. మూడు నాలుగు రోజులుగా పొగ మంచు కప్పి వేయడంతో ఎదురుగా వచ్చేవారు కూడా కనిపించడంలేదు. దీంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దట్టంగా పొగమంచు కమ్ముకుని ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పురం చుట్టుపక్కల 10 కి.మీ. వరకూ వాతావరణం ఇలాగే ఉంది.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం అర్బన్/మడకశిర టౌన్

మొండిగోడల మధ్య కల్యాణమండపం

చిలమత్తూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా మొండిగోడలకే పరిమితమైన కళ్యాణమండపానికి కూటమి ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగేనా అని కోడూరు ప్రాంతప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన కోడూరు మన్రో తోపులో మొదటి సారిగా ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన సమయంలో ఈ కల్యాణ పండపాన్ని మంజూరు చేశారు. అప్పట్లోనే రూ.10 లక్షల వ్యయంతో అన్ని హంగులతో కల్యాణ మండపం నిర్మించాలని ఆలోచించారు. అప్పట్లో వేగంగానే పనులు జరిగి గోడల వరకు నిర్మాణం పూర్తయినా, ఆ తరువాత ఎందుకో దాని నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఆ తరువాత ప్రభుత్వాలు మారినా...పాలకులు మారినా కల్యాణ మండప నిర్మాణానికి మాత్రం మోక్షం కలగలేదు. దాంతో ఇప్పటికీ అటుగా వెళ్లేవారందరినీ మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. ప్రధానంగా ఈ కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసుకుంటే కోడూరు పంచాయతీలోని 14 గ్రామాల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 44వ జాతీయ రహదారికి, పుట్టపర్తి రహదారికి మధ్యలో ఈ కల్యాణ మండపం ఉండటంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. చుట్టుపక్కల గ్రామాల్లో వివాహాలు, ఇతర శుభకార్యాలు జరుపుకోవాలన్నా గోరంట్ల, బాగేపల్లి, చిలమత్తూరు పట్టణాలకు వెళ్లి ప్రైవేటు కల్యాణమండపాలను ఆశ్రయిస్తున్నారు. దాంతో అధిక వ్యయం చేసుకోవాల్సి వస్తోంది. ఈ కల్యాణ మండప నిర్మాణం పూర్తి చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగడమే కాకుండా పంచాయతీకి కూడా ఆదాయ వనరుగా మారే అవకాశం ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కల్యాణ మండప నిర్మాణంపై పాలకులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.


కోడూరు తోపులో మొండి గోడలకే పరిమితమైన కల్యాణ మండపం



ఇక ఉపాధి అక్రమాలకు ఫుల్‌స్టాప్

ఫోన్‌లోనే ఉపాధి సమాచారం - అందుబాటులోకి కొత్త సాంకేతికత

హిందూపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన కూలీలకు ఏడాదికి వంద రోజులు పని కల్పిస్తున్నారు. ఈ పథకంలో పారదర్శకతను తీసుకొచ్చి అక్రమాలకు తావులేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో రకాల సంస్కరణలు తీసుకొచ్చాయి. ఇందులో భాగంగానే కూలీల వేతనాలు దుర్వినియోగం కాకుండా సదరు లబ్ధిదారులకే నేరుగా అందించడానికి బ్యాంక్, పోస్టాఫీసు ఖాతా తెరిచి వాటి ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఇదిఇలా ఉంటే కొందరికి ఒకటి కంటే ఎక్కువ ఖాతాలు ఉండటం, ఆధార్ లింకేజ్ ద్వారా డబ్బులు ఏ ఖాతాలో జమచేశారో తెలుసుకునేందుకు కూలీలు ఇబ్బందులు పడేవారు. ఇకనుంచి అలాంటి బాధలు లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జన్మన్‌నరేగ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో చేపట్టే పనుల వివరాలు తెలుసుకోవడంతోపాటు అందులో జరిగే అక్రమాలపై కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఇది అన్నిభాషల్లోనూ అందుబాటులో ఉంటుంది.

ప్లేస్టోర్‌లో జన్మన్‌నరేగ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో కూలీ వేతనాలు, పనిదినాలకు సంబంధించిన వాటిని ఎంపిక చేయాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, ఐడికార్డ్ నమోదు చేయాలి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి కూలీ పేరుపై ఎంపిక చేస్తే ఎక్కడ పనిచేశారు, అందుకు సంబంధించిన పని వివరాలతోపాటు వేతనాలు ఎప్పుడు జమచేశారు, ఏ బ్యాంక్‌లో వేశారు, వివరాలు లభిస్తాయి. ఉపాధిహామీ వేతనాలు జమకాకపోతే ఆ కూలీ ఖాతాకు సంబంధించి ఆధార్‌లింక్ అయిందా బ్యాంక్ వివరాలు ఏపీపీఎస్ లింక్ అయిందా అనే వివరాలు ఉంటాయి. ఒక వేళ అన్ని లింక్ అయితే పచ్చరంగులో రైట్ గుర్తు ఉంటుంది. లేనిపక్షంలో ఏది కాలేదో అక్కడే ఎర్రరంగులో చూపుతుంది. దీనిని బట్టి వేతనాల్లో ఇబ్బందులు లేకుండా నేరుగా లబ్ధిదారుడే చూసుకోవచ్చు. అలాగే జాబ్‌కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు కనిపిస్తాయి. అందులో అటెండెన్స్ ఆప్షన్ ఎంపిక చేస్తే ఏడాదిలో ఎన్నిరోజులు పనిచేశారో వివరాలు కనిపిస్తాయి.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్

గోరంట్ల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల కోసం వెంటనే ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గోరంట్లలోని సంత మార్కెట్‌లో భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ శేఖర్ హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని సీపీఐ నాయకులు విమర్శించారు. సంక్షేమ పథకాలు కార్మికులకు అందకుండా 1214 మెమోను తీసుకు వచ్చారన్నారు. దీంతో గత ఐదేళ్లగా కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కూటమి నాయకులు కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపుతామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటివరకు ఒక్క హామీకూడా అమలుకాలేదన్నారు. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించుకోవడానికి భవిష్యత్‌లో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఐటియూ అనుబంధంగా మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులుగా మహబూబ్‌బాషాను, ప్రధాన కార్యదర్శిగా ముద్దల వెంకటరమణప్పను, కోశాధికారి బాబ్‌జాతోపాటు 20మంది సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామక్రిష్ణ, ముత్యాలు, కొండా వెంకటేష్, పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కార్మిక సంఘం నాయకులు

కొండను తవ్వి ఎలుకను పట్టారు

● ఉపాధి పనుల్లో రూ.6.02కోట్లకుగాను రూ.47,642 అవినీతి

పెనుకొండ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2023-24సంవత్సరానికి సంబంధించి మండలంలో చేపట్టిన వివిధ పనులకుగాను సామాజిక బృందం మంగళవారం తనిఖీ నిర్వహించింది. అయితే కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు నివేదిక ఇచ్చారని పలువురు అంటున్నారు. పెనుకొండ మండలంలో 2023-24లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఈనెల 6నుంచి 16వరకు సామాజిక బృందం సభ్యులు ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు ఆయాగ్రామాల్లో పర్యటించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ ఏపీడీ విజయప్రసాద్, జిల్లా విజిలెన్స్ ఆధ్వర్యంలో సామాజిక బృందం సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఇందులో 678పనులకుగాను రూ.6.02కోట్లు నిధులు ఖర్చుచేశారన్నారు.

అందులో రాంపురంలో రూ.7,859, కురుబవాండ్లపల్లిలో రూ.2,049, మావటూరులో రూ.1,087, మునిమడుగులో రూ.9,787, శెట్టిపల్లిలో రూ.1,194, వెంకటగిరిపాళ్యంలో రూ.3,124, నాగలూరులో రూ.7,214, గుట్టూరులో రూ.1,902, దుద్దేబండలో రూ.289, గోనిపేటలో రూ.13,136, మొత్తం రూ.47,642 అవినీతి జరిగిందని సామాజిక బృందం సభ్యులు అధికారులకు వివరించారు. వారం రోజుల్లోపు రికవరీ చేయాలంటూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ శివానందనాయక్, ఏఈఓ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, ఉపాధికూలీలు పాల్గొన్నారు.



ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్న దృశ్యం

చోరీల నివారణకు పోలీసుల కొత్త వ్యూహం

పావగడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన ఇళ్లల్లో ఇటీవల దొంగతనాలు జరుగుతుండడంతో వాటిని అరికట్టడానికి పోలీసు శాఖ కొత్త వ్యూహం రచించినట్లు సీఐ సురేష్ తెలిపారు. ప్రధాన ఇళ్లను టార్గెట్ చేసుకొని ముఖ్యంగా ఇంటికి తాళాలు వేసి ఇతర ఊళ్లకు వెళ్లిన వారి ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగలు అధికంగా దొంగతనాలకు పాల్పడుతున్నారని ఇటీవల వెల్లడైందని ఆయన తెలిపారు. ఇళ్లలో అధికంగా డబ్బు బంగారం ఉన్నవారు ఇతర ఊళ్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం అందించాలని, అలాంటి సమయంలో ఆ వీధులలో రాత్రి పోలీసు గస్తీలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు దీనికి సహకరించి ఇతర ఊళ్లకు వెళ్లే సమయంలో తప్పక పోలీసులకు సమాచారం అందించాలని సీఐ సురేష్ స్వయంగా కరపత్రాలను అతికించారు.



ఇళ్లకు కరపత్రాలను అతికిస్తున్న సీఐ సురేష్

నీటి సంఘాలను నిర్వీర్యం చేసిన వైసీపీ

● బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత


మంత్రిని కలిసిన సాగునీటి సంఘం అధ్యక్షులు, సభ్యులు

పెనుకొండ టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసి చెరువులన్నీ నిరుపయోగం చేశాడని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఎద్దేవా చేశారు. ఇటీవల సాగునీటి సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు, సంఘం సభ్యులు మంగళవారం ఆమె స్వగృహంలో మంత్రిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో కష్టపడిన నాయకుడి నుంచి కార్యకర్త వరకు గుర్తింపు ఉంటుందని అదే తరహాలో పదవులు అప్పజెప్పామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయడం శుభపరిణామమని, చెరువులన్నింటికీ మహర్దశ వస్తుందని వీటి ద్వారా ఎంతో మంది రైతులు పంటలుపెట్టి అభివృద్ధి చెందుతారన్నారు. పదవులు వచ్చిన ప్రతి ఒక్కరూ రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి వేధింపులు భరించలేం

పెనుకొండ టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు సౌమ్య వేధింపులు భరించలేకపోతున్నామని ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను పట్టణంలోని ఆమె గృహంలో మంగళవారం కలిసి, సమస్యలు మొరపెట్టుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు మాట్లాడుతూ.. వైద్యురాలు నానా దుర్భాషలాడుతున్నారన్నారు. ఆమె చేష్టలతో విధులకు వెళ్లలేకపోతున్నామని వాపోయారు. ఈ విషయంపై డా.సౌమ్యను అడగ్గా.. వారికి కేటాయించిన విధులను సక్రమంగా చేయాలని ఒత్తిడి తెచ్చానేగాని వ్యక్తిగతంగా ఎవరినీ దూషించలేదన్నారు. మంత్రికి ఫిర్యాదు చేసిన వారిలో ఏఎన్ఎంలు సుశీలమ్మ, వరలక్ష్మి, కవిత, ఆశావర్కర్లు ఉన్నారు.

నరసింహస్వామికి రఘువీరారెడ్డి ప్రత్యేక పూజలు

మడకశిర రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవానం భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయ స్వామివారికి ప్రత్యేకగా అలంకరణచేసి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పణ చేశారు. రాత్రి భక్తరహళ్ళి గ్రామం నుంచి జిల్లేడగుంట గ్రామం వరకు స్వామి వారిపూల పల్లకి ఉత్సవం, గరుడోత్సం కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు స్వామి వారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

నేడు కంబాల జ్యోతుల పరుష

బ్రహ్మోత్సవాలో భాగంగా బుధవారం కంబాల నరసింహస్వామి జ్యోతుల పరుష నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.



పూజా కార్యక్రమంలో రఘువీరారెడ్డి దంపతులు

బాల్య వివాహాలను నివారిద్దాం

రొళ్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల చట్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో కమిటీని బలోపేతం చేస్తే బాల్య వివాహాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నక్క, మెడికల్ డిపార్ట్‌మెంట్, పంచాయతీ సెక్రెటరీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

అమరాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయం ఆవరణలో మంగళవారం తహసీల్దార్ మారుతీప్రకాష్ ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం భూసమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

క్రైం కార్నర్

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

పరిగి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని బొలేరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఉప్పరనవీన్ (19) దుర్మరణం చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు శాసనకోట గ్రామానికి చెందిన ఉప్పర నవీన్ అయ్యప్ప మాల ధరించాడు. భజన కార్యక్రమానికి శాసనకోట నుంచి బసవనపల్లికి తన స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా కళ్యాణదుర్గం వైపు నుంచి వస్తున్న బొలేరో వెనుక నుండి ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. అతడిని హుటాహుటిన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. కాగా నవీన్ వెంట వెళ్లిన ఇద్దరు స్నేహితులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.


నవీన్ (ఫైల్)

టర్పెంటైన్ ఆయిల్ తాగి మహిళకు అస్వస్థత

గోరంట్ల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెండూరువాండ్లపల్లికి చెందిన వివాహిత రాజేశ్వరీ టర్పెంటైన్ ఆయిల్ తాగి అస్వస్థతకు మంగళవారం గురయ్యారు. ఆంజనేయుల భార్య రాజేశ్వరి ఇంటిలో పెయింట్‌లో కలపడానికి తెచ్చిన ఆయిల్‌ను వామ్‌వాటర్ అనుకుని పొరపాటున తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

గడ్డి వామి దగ్ధం

లేపాక్షి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసవన్నపల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణస్వామి గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పొలం వద్ద పశువుల మేతకోసం ఐదు లోడ్ల వరి, మొక్కజొన్న చొప్పను వామి వేయగా మంగళవారం అనుకోకుండా నిప్పంటుకుని దగ్ధమైందని యజమాని తెలిపారు. దీంతో దాదాపు 30వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.


దగ్ధమైన గడ్డివామి

వృద్ధురాలి ఆత్మహత్య

పెనుకొండ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనిపేటలో పార్వతిబాయి(64)అనే వృద్ధురాలు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గోనిపేటకు చెందిన పార్వతిబాయి గత కొంతకాలంగా ఆరోగ్యం బాగాలేక జీవితంపై విరక్తిచెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త జయరాంనాయక్, కుమారుడు శ్రీరామ్‌నాయక్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.